# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 01-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉదయం ప్రారంభమైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నారు.**

**2.** **సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన వరద సాయాన్ని ఈ నెల 4వ తేదీ లోగా అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3.** **మహాత్మా గాంధీ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి సూచించారు.**

**4.** **రాష్ట్రంలో పాఠశాలలకు ఈనెల 3 నుంచి దసరా సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.**

**5.** **ఈ రోజు స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

**============================**

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులకు ఈ రోజు ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. పట్టణాలు ...., గ్రామాలలో మంత్రులు ... శాసన సభ్యులు .... జిల్లా కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్నారు. మధ్యాహ్నానికే అత్యధిక శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో మరి కొద్ది సేపట్లో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి ... వారితో సంభాషిస్తారు.

మచిలీపట్నంలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అమలు చేస్తామని ప్రకటించారు.

ప్రకాశం జిల్లా కొండపి నియోజక వర్గం టంగుటూరు మండలం సూరారెడ్డి పాలెం ..., వల్లూరు పంచాయతీ పరిధిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పెన్షన్లు అందజేశారు.

విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజ పతి రాజు జిల్లా కేంద్రంలో పెన్షన్లు పంపిణీ చేశారు.

-------------------------

సాంకేతిక సమస్యల కారణంగా వరద సహాయం అందని బాధితులకు ఈ నెల 4వ తేదీ లోగా సహాయం అందించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

వరద సహాయం అందజేయడంలో ఎదురైన సమస్యలు ...., వరద బాధితుల ఫిర్యాదులపై వెలగపూడి సచివాలయంలో నిన్న సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. బ్యాంకు ఖాతాలు వాడకంలో లేకపోవడం ...., ఆధార్ అనుసంధానం కాకపోవడం ...., ఖాతా సంఖ్య తప్పుగా నమోదు కావడం ...., బాధితుల వివరాలు సక్రమంగా అందకపోవడం కారణంగా అనేక మందికి వరద సహాయం అందలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఈ నెల 4వ తేదీ నాటికి అందరికీ సహాయం అందేలా చర్యలూ తీసుకోవాలని చంద్ర బాబు నాయుడు ఆదేశించారు.

---------------------------

నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలి పెట్టవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు డైరెక్టర్ జనరల్, పోలీసు కమిషనర్ ...., సి.ఐ.డి. విభాగం తదితర పోలీసు ఉన్నతాధికారులతో వెలగపూడి సచివాలయంలో నిన్న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..... నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కూడా ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ...., నేరాల నియంత్రణపై అధికారులను ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

---------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ రోజు నుండి మూడు రోజులపాటు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. ఈ రోజు సాయంత్రం ఆయన అలిపిరి పాదాల మండపం నుండి కాలినడకన తిరుమలకు చేరుకుంటారు. రేపు ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. తిరుమలలో ఆయన లడ్డూ కౌంటర్ ...., అన్న ప్రసాద కేంద్రం ...., వెంగమాంబ భోజన సముదాయాన్ని పరిశీలిస్తారు. మూడవ తేదీన తిరుపతిలో జరిగే వారాహి సభలో ఆయన ప్రసంగిస్తారు.

---------------------------

రాష్ట్రంలో భూముల రీ సర్వేలో జరిగిన తప్పొప్పులను సరి దిద్ది ...., ప్రజలకు ఉత్తమ రెవిన్యూ సేవలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ..... షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే ఈ సదస్సులు జరగవలసి ఉన్నప్పటికీ .... రెవిన్యూ సిబ్బంది వరద సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో ఈ సదస్సులను వాయిదా వేశామని చెప్పారు.

---------------------------

ప్రజల సమస్యలను పరిష్కరించే ఉద్దేశ్యంతో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఈరోజు ప్రజా దర్బార్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా లోకేష్ హామీ ఇచ్చారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంతో పాటు శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుండి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడును రెండు ఆలయాల అర్చకులు ..., అధికారులు నిన్న ఆహ్వానించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ..., ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ అధికారులు ముఖ్య మంత్రిని కలుసుకుని ఈ మేరకు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

---------------------------

సత్యం ..., అహింస ..., కుల వివక్ష లేని సమాజం కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మా గాంధీ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.

మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని రేపు భీమవరంలోని క్విట్ ఇండియా స్తూపం వద్ద విద్యార్థినీ విద్యార్థులతో కలిసి అమరులైన స్వాతంత్ర్య యోధులకు నివాళులు అర్పించారు. అనంతరం ... గాంధీ వేషధారణ కలిగిన పిల్లలతో శాంతి ప్రదర్శన నిర్వహించి.... ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించామని తెలియజేస్తూ ......

..వాయిస్.... 28 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటిస్తూ పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటూ దసరా సెలవులను ఒక రోజు ముందుకు మార్చారు. తొలుత అక్టోబర్ 4 నుండి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం .... ఉపాధ్యాయుల అభ్యర్థనలతో సెలవులను 3 నుండి 13వ తేదీకి మార్చారు. 14వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

మనిషి ప్రాణాలను కాపాడి పునర్జన్మ నిచ్చే రక్తం ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించేందుకు దేశంలో ఈ రోజు జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ ...., ఇమ్యునో హేమటాలజీ ఆధ్వర్యంలో 1975 అక్టోబర్ ఒకటవ తేదీ నుండి ఈ కార్యక్రమం జరుగుతోంది. స్వచ్ఛంద రక్త దాన ప్రాముఖ్యత గురించి దేశ వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. స్వచ్ఛంద రక్త దాన ప్రచారం పట్ల సామాన్య ప్రజలలో అవగాహనా లేమి ... అపోహలను తొలగించడానికి ఆరోగ్య శాఖ అధికారులు ....,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త ...., రఘుపతి వెంకటరత్నం నాయుడు జయంతి ఈ రోజు. 1865వ సంవత్సరం అక్టోబర్ ఒకటవ తేదీన మచిలీపట్నంలో జన్మించిన ఆయన ఉన్నత విద్యావంతుడు. సమాజంలో కుల వ్యవస్థ

నిర్మూలనకు ...., మహిళా విద్యా వ్యాప్తి కోసం విశేష కృషి చేశారు. వెనుక బడిన వర్గాలు ..., పేద విద్యార్థులకు వసతి ..., భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. మద్యపాన నిషేధం కోసం కూడా విశేషంగా శ్రమించిన రఘుపతి వెంకటరత్నం నాయుడు ....1939 మే 26వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....25 సెకన్లు....

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డిజిపి ద్వారకాతిరుమలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్యభవనంలో తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి అధికారులు, పోలీసు ఉన్నతాధికారులతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని.. బ్రహ్మోత్సవాల సమయంలో 2వేల మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడసేవ ఈనెల 8వతేదీ జరుగనున్న నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భద్రతను మరింత పెంచుతామన్నారు.

---------------------------

రాష్ట్రంలో చిరు వ్యాపారుల కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "జగనన్న తోడు" పథకం పేరును ప్రస్తుత ఎన్.డి.ఎ. కూటమి ప్రభుత్వం మార్పు చేసింది "చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు' అని ఈ పథకానికి పేరు పెట్టింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

=====================